
ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 357 మంగళవారం 24-12-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## చిత్రసీమ దిగ్గజం
## బెనగల్ కన్నుమూత

శ్యామ్ బెనగల్‌గా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ వాసి



**ముంబై,డిసెంబర్23:** భారతీయ సినీ పరిశ్రమ మరో దిగ్గజాన్ని కోల్పోయింది. తెలంగాణ ఆత్మని తెరపై ఆవిష్కరించిన అతికొద్ది గొప్ప డైరెక్టర్లలో ఒకరైన శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం మృతి చెందారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. అంకుర్, భూమిక, నిషాంత్, కలుగ్, మంతన్ సహా ఎన్నో సినిమాలను తెరకెక్కించారు. 1934లో డిసెంబర్ 14న హైదరాబాదు తిరుమలగిరిలో జన్మించిన ఆయనను పద్మశ్రీ, పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే సహా పలు అవార్డులు వరించాయి. శ్యామ్ బెనెగల్‌గా ప్రఖ్యాతిగాంచిన బెనగళ్ల శ్యామ్‌సుందరరావు హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో 1934 డిసెంబర్ 14న జన్మించారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎం.ఎ. ఎకనామిక్స్‌లో పట్టా పొందారు. 1959లో ముంబయి కేంద్రంగా ఉన్న ఓ యాడ్ ఏజెన్సీలో కాపీరైటర్‌గా పనిచేశారు. మరో సంస్థలో క్రియేటివ్ హెడ్‌గా కొనసాగారు. 1962లో తొలి గుజరాతీ డాక్యుమెంటరీ రూపొందించారు. దశాబ్దం తర్వాత ఫీచర్ ఫిల్మ్‌ను ఆయన తెరకెక్కించారు. అనంత్ నాగ్, షాబానా అజ్మీ ప్రధాన పాత్రలో రూపొందిన ఆ చిత్రమే 'అంకుర్'. సెకండ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో జాతీయ అవార్డు అందుకుంది. 'నిషాంత్', 'మంథన్', 'భూమిక', 'సమర్', 'హరి- భరీ', 'మండి'.. ఇలా బెనెగల్ దర్శకత్వం వహించిన దాదాపు అన్ని సినిమాలు అవార్డు దక్కించుకోవడం విశేషం. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన చివరి చిత్రం 'ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్' గతేడాది విడుదలైంది. పలు లఘు చిత్రాలు, ధారా వాహికలకూ బెనెగల్ దర్శకత్వం వహించి తనదైన ముద్ర వేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, ఏఎన్ఆర్ వంటి అనేక జాతీయ అవార్డులు అందుకున్నారు. ఈ లెజెండరీ దర్శకుడి మరణం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు ప్రముఖులు, అభిమానులు సంతాపాలు తెలిపారు. బెనగల్ మృతికి ప్రధాని మోడీ సహా ప్రముఖులు సంతాపం తెలిపారు.

# ఏడాదిన్నరలో పదిలక్షల ఉద్యోగాలు

- దేశ చరిత్రలో ఇదో అతిపెద్ద రికార్డు
- దేశాభివృద్ధిలో యువతే కీలక పాత్ర
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామకపత్రాలు
- యువతను అభినందించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,డిసెంబర్23:** తమ పాలనలో యువతకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ఒకటిన్నర ఏళ్లలో 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దేశ చరిత్రలో ఇది పెద్ద రికార్డ్ అని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో నిజాయతీ, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నేడు జరుగుతున్న రోజ్‌గార్ మేళాలోనూ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్తగా నియామకమైన 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. భారతదేశ యువతతో మాట్లాండేందుకు తాను కువైట్ నుంచి రాత్రి భారత్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత దేశంలోని యువతతో తన మొదటి కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ప్రధాని ఉద్ఘాటించారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని.. వారిలోని సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వం మరింత ముందుకువెళ్తుందని అన్నారు.

# సంక్రాంతికి వస్తున్నాం!

### రైతుల ముంగిట్లోకి రెండు వ్యవసాయ సంక్షేమ పథకాలు

### కొత్త రేషన్ కార్డుల పంపిణీ కూడా సంక్రాంతి నుంచే

### 30న మంత్రివర్గ సమావేశం.. కీలక నిర్ణయాలకు ఆమోదం!




**తొలి సమయంహైదరాబాద్, డిసెంబరు 23:** తొలి ఏడాది పాలనలో రుణమాఫీ పథకం అమలుకు పూర్తి ప్రాధాన్యమిచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండో సంవత్సరంలో రైతులకు సంబంధించిన ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. సంక్రాంతి పండుగకు రైతు భరోసా, యాంత్రీకరణ పథకాలను రైతుల ముంగిట్లోకి తీసుకొస్తోంది. రేషన్ కార్డులు లేనివారికి కొత్త కార్డులు పంపిణీ చేసే పథకాన్ని కూడా సంక్రాంతి నుంచే అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 30న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇటీవలి అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో చర్చించిన అంశాలతోపాటు మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, కొన్ని కొత్త సంక్షేమ పథకాలు కూడా సంక్రాంతి నుంచి అమల్లోకి రానున్నాయి. మొదటి సంవత్సరం వ్యవసాయ రంగంలో కీలకమైన రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన విషయం తెలిసిందే. నాలుగు విడతల్లో 25.36 లక్షల మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. దీంతో పాటు ఏడాదిలో ఒక విడత రైతుబంధు నిధులు కూడా విడుదల చేసింది. కేసీఆర్ ప్రభుత్వం 2023-24 సంవత్సరంలో ఒక పంటకు రైతుబంధు ఇచ్చి, రెండో పంటకు ఎగ్గొట్టిందని, తాము తొలి ఏడాదిలో ఒక పంటకు పాతలెక్క ప్రకారం ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ.7,500 కోట్లు రైతుబంధు ఇచ్చామని రేవంత్ సర్కారు వెల్లడించింది. ఇక రైతు భరోసా విధి విధానాలు ఖరారు చేసి రెండో పంటకు ఎకరానికి రూ.7,500 చొప్పున పంపిణీ చేస్తామని ప్రకటించింది.

**ఉపసంఘం నివేదిక రాగానే రైతు భరోసా..**

రైతు భరోసా పథకాన్ని సంక్రాంతికి అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ప్రకటించిన విషయం విదితమే! శాసనసభ, శాసనమండలిలో ఇటీవల రైతు భరోసాపై చర్చ కూడా పెట్టారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలో ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం కొన్ని జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేసింది.

### నమ్మక ద్రోహానికి పాల్పడుతున్న
## రేవంత్ ప్రభుత్వం

నమ్మించి నట్టేట ముంచుతుంది : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్,డిసెంబర్ 22:** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల భూములను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, అంకోల్ తండా ప్రజలను ఆదుకుంటానని నమ్మించి.. ఇప్పుడు రైతులను అప్పు చెల్లించాలంటూ వేధించడం, రైతులకు రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న నమ్మక ద్రోహానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు ఓ మాట, ఎన్నికలలో గెలిచాక మరో మాట.. ఇదీ రేవంత్ రెడ్డి గారి రెండు నాల్కల ధోరణి అంటూ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'ఎన్నికల ముందు ఓ మాట.. ఎన్నికలలో గెలిచాక మరో మాట.. ఇదీ రేవంత్ రెడ్డి గారి రెండు నాల్కల ధోరణి కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం, దుర్కి, నస్రుల్లాబాద్, మిర్జాపూర్, నాచుపల్లిలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల భూములను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. రుణాలు మాఫీ చేసి అన్నదాతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, డబ్బులు కట్టాలంటూ అంకోల్ తండాలో రైతులపై ఒత్తిడి తీసుకురావడం, బలవంతంగా భూముల వేలానికి ప్రయత్నించడం నియంతృత్వ పాలనను తలపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, అంకోల్ తండా ప్రజలను ఆదుకుంటానని నమ్మించి.. ఇప్పుడు రైతులను అప్పు చెల్లించాలంటూ వేధించడం , రైతులకు రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న నమ్మక ద్రోహానికి నిదర్శనం.' అంటూ ట్వీట్ చేశారు.

## అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసులు

నేడు స్టేషన్ విచారణకు హాజరు కావాలని ఆదేశం



**హైదరాబాద్,డిసెంబర్23:** సినీనటుడు అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రశ్నించనున్నారు. 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద విషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనికి సంబంధించి 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో అల్లు అర్జున్ 11వ నిందితుడిగా ఉన్నారు. డిసెంబరు 13న ఆయన్ను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్ విధించింది. అనంతరం రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో అల్లు అర్జున్‌కు మరోసారి నోటీసులు జారీ చేసిన పోలీసులు.. తొక్కిసలాట ఘటనపై మరింత లోతుగా విచారించే అవకాశముంది.

# పారదర్శకంగా ఉద్యోగనియామకాలు

### రోజ్‌గార్ మేళాలో నియామకపత్రాలు
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,డిసెంబర్23:** అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 526 మందికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. దేశ వ్యాప్తంగా 71 వేల మందికి నేడు నియామక పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దళారుల మాట విని మోసపోవద్దని ఉద్యోగార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 10 రోజ్ గార్ మేళాలు పూర్తి అయ్యాయని, ఇది 11 వ మేళా అని ఆయన అన్నారు. ఈ రోజుతో కలుపుకొని సుమారుగా పది లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నా. ప్రతి నెల ఉద్యోగ నియామకాలు జరగాలి, ఖాళీలు ఉండొద్దు అని ప్రధాని ఆదేశాలు ఇచ్చారన్నారు. అందుకే రెగ్యులర్ గా నియామకాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. గతంలో ఉద్యోగ నియామకాల్లో అవినీతి జరిగేది.. ఇప్పుడు పూర్తిగా పారదర్శకంగా నియామకాలు జరుగుతున్నాయని, నా మంత్రిత్వ శాఖలో మొత్తం రెగ్యులర్ కాంట్రాక్టు ఇతర కలిపి 8 లక్షల ఉద్యోగులు ఉంటారు? ఖాళీలను వెంటనే భర్తీ చేస్తున్నామన్నారు. కరోనాతో ఎన్నో దేశాలు ఆర్థికంగా అతలాకుతలం అయ్యాయని, మన దేశంలో తయారు అవుతున్న మొబైల్ ఫోన్‌లను అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి అవుతున్నాయని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మన దేశంలో 5జి సేవలు అందుతున్నాయి? చాలా దేశాల్లో 5జి లేదని ఆయన అన్నారు. అతి తక్కువ ఛార్జ్ తో నెట్ సేవలు అందిస్తున్న దేశం మన దేశం అని, దేశంలో జఖఎ/డిజిటల్ ట్రాన్సాక్షన్స్ పెరిగాయన్నారు. డిఫెన్స్ పరికరాలు ఎగుమతి చేస్తున్నామన్నారు. మన దేశ యువత అతి తొందరలోనే ప్రపంచాన్ని శాసిస్తుందన్నారు కిషన్ రెడ్డి. మన తల్లి దండ్రులను, మన గ్రామాన్ని, మన మాతృ దేశాన్ని, మన గురువులను ఎప్పటికీ మరవకూడదన్నారు. అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే తమ ఆకాంక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హకీంపేట్‌లోని నిసా కేంద్రంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 340 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 8.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. కేంద్ర ఉద్యోగాల్లో అన్ని శాఖల ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### అంగరంగవైభవంగా
## పివి సింధు పెళ్లి

**ఉదయపూర్ వేదికగా ఒక్కటైన జంట**

**నేడు హైదరాబాద్‌లో వివాహ విందు**

**హైదరాబాద్,డిసెంబర్23:** భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌కు చెందిన 29 ఏళ్ల వెంకట దత్త సాయితో సింధు వివాహం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాజస్థాన్ ఉదయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, పలువురు ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఇవి చూసిన అభిమానులు సింధు జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేశారు.కాగా, సింధు పెళ్లి చేసుకున్న వెంకట దత్త సాయి.. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి పీవీ రమణ స్వయంగా వెల్లడించిన విషయం తెలిసిందే. ఇక ఈనెల 14న వీరిద్దరి ఎంగేజ్మెంట్ కూడా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పీవీ సింధు, వెంకట



దత్తసాయి రింగ్స్ మార్చుకున్నారు. ఎంగేజ్‌మెంట్ ఫొటోను సింధు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో షేర్ చేస్తూ? 'ఒకరి ప్రేమనకు దక్కిన సమయంలో.. తిరిగి మనం ప్రేమించాలి' అని క్యాప్షన్ ఇచ్చింది.ఆదివారం రాత్రి 11.20 గంటలకు రాజస్థాన్‌లోని ఉదయ్ సాగర్ లేక్‌లోని సుందరమైన రాఫెల్స్ హోటల్‌లో మూడుముళ్ల బంధంతో ఈ జంట ఒక్కటయ్యారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, పలువురు ప్రముఖుల నడుమ వీరి పెళ్లి వేడుక జరిగింది. ఈ పెళ్ళికి కేంద్రసాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని దీవించారు. అందుకు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# రవాణాశాఖ ద్వారా సులభతర సేవలు

**- మార్కెట్ యార్డ్ ప్రాంతంలో రవాణాశాఖ విభాగం - ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**




**పుట్టపర్తి,డిసెంబర్23:** ప్రజలకు రవాణా శాఖ ద్వారా సేవలన్నీ సులభతరంగా అందించాలన్న ధ్యేయంతో ధర్మవరం మార్కెట్ యార్డ్ ప్రాంతంలో రవాణా శాఖ విభాగంను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య శాఖల మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ధర్మవరం మార్కెట్ యార్డులో రవాణా శాఖ ఏర్పాటుచేసిన ఆ÷-లనైన్ సేవలను మంత్రి ప్రారంభించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కరుణాసాగర్, కదిరి ఎం .వి.ఐ వరప్రసాద్ , ధర్మవరం ఎం.వి.ఐ రాణి, ఆర్డీవో మహేష్ ధర్మవరం తెలుగుదేశం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ , రాష్ట్ర జనసేన నాయకులు చిలక మధుసూదన్ రెడ్డి , ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, పలువురు ప్రజా ప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాహనాల కు సంబంధించి లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఎల్ ఎల్ ఆర్, ఫిట్నెస్, పర్మిట్లు మంజూరు తదితర సర్టిఫికెట్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ప్రజలు రవాణా శాఖ ద్వారా సేవలు పొందాలంటే హిందూపురం ,అనంతపురం, కదిరి ప్రాంతాలకు వెళ్లే వారిని ప్రస్తుతం 90 కిలోమీటర్ల వరకు ప్రయాణించే శ్రమను తగ్గించి ప్రస్తుతం తాత్కాలికంగా రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర గౌరవం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి , రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారాలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు అవసరమైన మేరకు రవాణా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు కనీస అవసరాలు కూడా తీర్చలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో అనేక పరిపాలన నిర్మాణాత్మకమైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో శాశ్వత రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటు చేయుటకు ఆర్డిఓ మరియు రవాణా శాఖ అధికారి ద్వారా భూసేకరణకు సంబంధించి ప్రతిపాదన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కొన్ని దశాబ్దాల కాలంగా రవాణా శాఖ కార్యాలయం లేని కారణంగా ప్రజల సమస్యలను గుర్తించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి ధర్మవరం పట్టణంతోపాటు రాప్తాడు నియోజకవర్గం లోని రామగిరి, సి.కే.పల్లి, కనుగానపల్లి మండల ప్రజానీకానికి కూడా ప్రమాణ శాఖ సేవలు అందించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఈ ఆరు మండలాలకు సంబంధించిన ప్రజలు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. అంతేగాక చెరువులకు నీరు పటలకు సాగునీరు జలజీవన్ మిషన్ పనులు తదితర కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మరి ముఖ్యంగా పట్టణ గ్రామాలలో గుంతలు లేకుండా రహదారుల నిర్మాణం కోసం సుమారు రూ.26 వేల కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి నీరు అందించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని సుమారు రూ. 70 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో పెట్రోల్ ,డీజిల్ ఆదా చేసే క్రమంలో ఎలక్ట్రానిక్ వాహనాలు కూడా ప్రభుత్వం ద్వారా వాడుకలో రానున్నాయని మంత్రి తెలిపారు.

# జూన్ 12కల్లా 1.18 లక్షల టిడ్కో గృహాలు పూర్తి

**- టిడ్కోగృహాలను పూర్తికి రూ.102 కోట్ల చెల్లింపు - అమరావతి జోన్-7,10 లే అవుట్ల రోడ్ల నిర్మాణం**

**- రూ.2,723 కోట్లతో అమరావతి పనులకు సీఎం ఆమోదం - సిఆర్‌డిఏ సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రినారాయణ**




**అమరావతి,డిసెంబర్23:** రాజధాని అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. జూన్ 12 నాటికి 1.18 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. సచివాలయంలో జరిగిన సీఆర్డీఏ 44వ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎల్పీఎస్ జోన్ 7, జోన్ 10లో మౌలిక వసతుల కల్పనకు నిర్ణయం తీసుకున్నారు. రాజధాని ఔటర్ రింగ్‌రోడ్డు, విజయవాడ బైపాస్ రోడ్డు ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఇప్పటి వరకు రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. మూడు సంవత్సరాల్లో అమరావతి రాజధాని అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం అన్నారు. జధాని అభివృద్ధికి అయ్యే వ్యయా భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయం అన్నారు. రాజధాని భూములు అమ్మగా వచ్చే సొమ్మునే రుణాలు తీర్చేందుకు ఉపయోగిస్తాం అన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను సమానం అభివృద్ధి పర్చేందుకు ప్రణాళికాబద్దంగా చర్యలు తీసుకోవాలన ఇనిర్ణయించారు. సమావేశానంతరం వివరాలను మంత్రి నారాయణ వెల్లడించారు. వచ్చే ఏడాది జూన్ 12 వ తేదీ కల్లా 1.18 లక్షల టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

సోమవారం రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన 44 వ సీఆర్డీఏ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగిందని, ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు ,టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే బ్యాంకు రుణాలు తీసుకుని నాన్ పెర్ఫార్మింగ్ ఎస్సెట్స్ గా మిగిలి పోయిన టిడ్కో గృహాలను పూర్తి చేయడానికి రూ.102 కోట్లను చెల్లించేందుకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెల్పారన్నారు. 2014-19 మద్యకాలంలో కేంద్ర ప్రభుత్వంచే 7,01,481 టిడ్కో గృహాలను మంజూరు చేయించి, వాటిలో 5.00 లక్షల గృహాలకు పరిపాలనాపరమైన అనుమతులను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటిలో 4,54,706 గృహాలను గ్రౌండ్ చేయడం జరిగింది. అందులో 2019 నాటి 3,13,832 గృహ నిర్మాణాలను ప్రారంభించడం జరిగింది. ప్రతి యూనిట్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మొత్తం రూ.3.90 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించగా, అందులో రూ.1.90 లక్షలు కేంద్ర ప్రభుత్వం, మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేలా నిర్ణయించడం జరిగిందన్నారు. అదే విధంగా లబ్దిదారుని వాటగా చెల్లించాల్సిన సొమ్మును బ్యాంకు రుణంగా ఇప్పించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వం అదికారంలోకి వచ్చి ఈ పక్రియను అంతా గందరగోళం చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం టెండర్లు పిలిచి నిర్మాణానికి చేపట్టిన 4,54,706 గృహాలలో కేవలం 2,61,640 గృహాలను మాత్రమే గత ప్రభుత్వం చేపట్టి మిగిలిన వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. ఆ చేపట్టిన గృహాలను కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. ఈ గృహాలలో దాదాపు 77 వేల గృహాలను తమ ప్రభుత్వమే పూర్తి చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహాలపై గత ప్రభుత్వం బ్యాంకు ఋణాలను తీసుకుని, ఆ సొమ్మును డైవర్టు చేయడం జరిగిందన్నారు. ఫలితంగా ఆయా గృహాలు నాన్ పెర్ఫార్మింగ్ ఎస్సెట్స్గా మిగిలిపోయాయన్నారు. ఈ సమస్య నుండి బయట పడాలంటే రూ.102 కోట్లు చెల్లించాల్సి ఉంది, ఆ సొమ్మును ప్రభుత్వం చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెల్పారన్నారు. వీటిలో దాదాపు 1.18 లక్షల గృహ నిర్మాణాలను వచ్చే ఏడాది జూన్ 12 కల్లా పూర్తిచేసి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.రాష్ట్ర రాజధాని అమరావతిజోన్-7, 10 లే అవుట్ల రోడ్ల నిర్మాణ పనులను రూ.2,723 కోట్లతో చేపట్టేందుకు సీఆర్డీఏ ఆమోదం తెల్పినట్లు మంత్రి తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధికై ఇప్పటి వరకూ రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. మిగిలిన అభివృద్ధి పనుల్లో కొన్నింటికి ఈ నెలాఖరు లోపు, మిగిలిన వాటికి వచ్చేనెలలోపు ఆమోదం తెల్పి, వచ్చే నెల 15 వ తేదీలోగా అన్ని పనులకు టెండర్లు పిలిసి పనులను చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏ దేశానికైనా, రాష్ట్రానికి కైన ఒక రాజధాని తప్పని సరిగా ఉంటుందని, అదే విధంగా అంధ్రప్రదేశ్ కు అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పర్చేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుచున్నదన్నారు. అందులో భాగంగా రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి అయ్యే వ్యయా భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. పూలింగ్ ద్వారా రైతుల నుండి సేకరించిన భూములు అమ్మగా వచ్చే సొమ్ముతోనే అమరావతి అభివృద్ధికై తీసుకున్న రుణాలు తీర్చేందుకు చర్యలు చేపట్టడం జరుగుచున్నదన్నారు. ఈ విషయంలో ఎటువంట అపోహలకు తావులేదని, ఎవరు ఎటు వంటి వివర్శలు చేసిన ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. రాష్ట్రంలోని 26 జిల్లాలను సమానం అభివృద్ధి పర్చేందుకు 2014-19 మద్య కాలంలోనే తమ ప్రభుత్వం ప్రణాళికాబద్దంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర పునర్విభజనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన పలు కేంద్ర సంస్థలను సమానంగా అన్ని జిల్లాలకు కేటాయించడం జరిగిందన్నారు. విజయనగం జిల్లాకు గిరిజన విశ్వవిద్యాలయాన్ని, విశాఖ జిల్లాకు ఐఐఎం, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం / అనర్జీ ను, కాకినాడకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ ను, తాడేపల్లి గూడానికి నిట్ ను, మంగళగిరికి ఎయిమ్స్ ను, విజయవాడకు నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, తిరుపతికి ఐఐటి, ఐజర్ లను, కర్నూలుకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ / మ్యాన్యుప్రాక్చరింగ్ సంస్థను, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీని కేటాయించడం జరిగిందన్నారు. ఇదే విధంగా విశాఖపట్నంలో టిసిఎస్, గుగూల్ వంటి సంస్థలతో పాటు గత ప్రభుత్వం తరమేసిన లూలూ గ్రూప్ ను మళ్లీ వెనక్కు తీసుకువస్తున్నామన్నారు. కర్నూలులో 350 ఎకరాల్లో డ్రోన్ హబ్ ను ఏర్పాటు చేస్తున్నట్లు, రాయలసీమ జిల్లాల్లో మ్యాన్యుప్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం జరుగుచున్నదన్నారు. అవకాశం ఉన్న చోటల్లా పోర్టులను అభివృద్ధి పర్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పోర్టులు అభివృద్ధి అయ్యే ప్రతి చోటా అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ ద్వారా శాటిలైట్ సిటీలను అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

## మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి వ్యవహారం

**క్వాష్ పిటిషన్లు దాఖలు చేసిన కెసిఆర్, హరీష్ రావు**

**హైదరాబాద్,డిసెంబర్23:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందన్న అంశంపై భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలని కోరారు. మేడిగడ్డ నిర్మాణంలో ప్రమాణాలు పాటించలేదని, దీనివల్ల ప్రజాధనం వృథా అయ్యిందని రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా న్యాయస్థానం జులై 10న కేసీఆర్, హరీశ్‌రావు సహా ఆరుగురికి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు తాజాగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టనుంది.

## శ్రీతేజ్ కుటుంబానికి మైత్రీ మూవీ మేకర్స్ బాసట

**50 లక్షల చెక్కు అందచేత**

**హైదరాబాద్,డిసెంబర్23:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి 'పుష్ప' చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఆర్థికసాయం అందించింది. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మాత నవీన్ సోమవారం రూ.50లక్షల చెక్కును మృతురాలి కుటుంబానికి అందించారు. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేవతి భర్తను పరామర్శించి చెక్కును అందించారు. 'తొక్కిసలాట ఘటనలో రేవతి చనిపోవడం చాలా బాధాకరం. వారి కుటుంబానికి తీరనిలోటు. ప్రస్తుతం బాబు శ్రీతేజ్ కోలుకుంటున్నాడు. బాధిత కుటుంబానికి మా వంతు సాయం చేయడానికి ఇక్కడకు వచ్చాం. వారి కుటుంబానికి ఎప్పటికీ అండగా నిలబడతాం' అని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్‌లు తెలిపారు.

## కోలుకుంటున్న బాలుడు శ్రీతేజ్

**హైదరాబాద్,డిసెంబర్23:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి.. దాదాపు మూడు వారాలుగా కోమాలో ఉన్న శ్రీతేజ్ హెల్త్ బులిటెన్‌ను కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం విడుదల చేసింది. ప్రస్తుతం శ్రీ తేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, వెంటిలేటర్ లేకుండానే శ్వాస తీసుకుంటున్నాడని ఈ హెల్త్ బులిటెన్‌లో డాక్టర్స్ తెలిపారు. ఆదివారం కంటే సోమవారం అతని ఆరోగ్యం మెరుగైందని, కాకపోతే.. జ్వరం పెరుగుతోందన్నారు. అలాగే వైట్ బ్లడ్ సెల్స్, మిగితా సెల్స్ అన్ని ఇప్పుడిప్పుడే ఇంప్రూవ్ అవుతున్నాయి అని చెప్పారు. ఫుడ్ తీసుకోగలుగుతున్నాడని వెల్లడించారు. అయితే నాడీ వ్యవస్థ పనితీరులో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదన్నారు.

## రోడ్డు నాణ్యతను పరిశీలించిన పవన్

**44 గ్రామాల మంచినీటి పనులకు మరమ్మత్తులు**

**కృష్ణా జిల్లాలో పలు పనులకు శంకుస్థాపన**

**విజయవాడ,డిసెంబర్23:**



కంకిపాడు మండలంలోని గొడవర్రు గ్రామంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోమవారం పర్యటించారు. రూ.3.5 కోట్ల వ్యయంతో శరవేగంగా జరుగుతున్న గొడవర్రు -రొయ్యూరు రోడ్డు పనులను పవన్ పరిశీలించారు. ఇటీవల కంకిపాడులో జరిగిన బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విజ్ఞప్తి మేరకు అధ్వాన్నంగా ఉన్న రొయ్యూరు రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలంటూ పవన్ ఆదేశాలు జారీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు పనులు తుదిదశకు చేరుకోవడంతో పవన్ పరిశీలించారు. స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఇకపోతే జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. గుడివాడ నియోజకవర్గం పరిధిలోని మల్లాయపాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించారు. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గం పరిధిలోని 44 గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరరా వ్యవస్థకు మరమ్మత్తులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతంలో నీటి సరఫరా సరిగా లేదన్న విషయం పల్లె పండుగ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ దృష్టికి గుడివాడ శాసనసభ్యుడు వెనిగండ్ల రాము తీసుకురాగా… రూ. 3.8 కోట్ల నిధులు కేటాయంచి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఫిల్టర్ బెడ్లు పూర్తిగా దెబ్బ తినడంతో పంచాయతీకి రూ. 4 లక్షల ఖర్చు చేసి ఫిల్టర్ బెడ్లు మార్పు చేశారు. 14 గ్రామాల పరిధిలో ఫిల్టర్ బెడ్ల మార్పు పక్రియ పూర్తి అయిన క్రమంలో సోమవారం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మల్లాయపాలెం రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రం వద్ద క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. స్టోరేజీ ట్యాంక్, ఫిల్టర్ బెడ్లతోపాటు- 14 గ్రామాల్లో మరమ్మతులకు ముందు, తర్వాత నీటి నమూనాలను పరిశీలించారు. క్షేత్ర స్థాయి పరిశీలన నిమిత్తం గుడివాడ నియోజకవర్గానికి వచ్చిన పవన్ కళ్యాణ్ కి స్థానిక శాసనసభ్యులు వెనిగెండ్ల రాము ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ , జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.గుడివాడలో జనసేన, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు.

# పీవీ దేశానికి ఠీవి

**- ఆయన సేవలు మరువలేనివి**

**- పీవీ వర్ధంతి, జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమంలో పోలాడి రామారావు**



**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్, 23:** సంస్కరణల శిల్పి, స్థిత ప్రజ్ఞుడు, బహుభాషా కోవిదుడు, రచయిత ,దేశానికి దిక్సూచి,మార్గదర్శి, క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశాన్ని కాపాడిన ఆధునిక భారత నిర్మాతగా తెలంగాణా ముద్దు బిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు.సోమవారం సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమంలో పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా పీవీ చిత్రపటానికి రైతు నాయకులతో కలిసి పోలాడి రామారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. పీవీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు దేశ పగ్గాలు చేపట్టిన పీవీ చేపట్టిన సంస్కరణల తో దేశం ఆర్థికంగానే కాకుండా అణుశక్తి విదేశాంగ విధానం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అంతర్గత భద్రతలో ఎంతో ప్రగతి సాధించిందని కొనియాడారు.వినూత్న విధానాలను అనుసరించి దేశ సంపదను పెంచిన పీవీ స్ఫూర్తి ప్రస్తుత పాలకులు ఆచరించాలని పోలాడి రామారావు అన్నారు . అనంతరం నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమంలో పోలాడి రామారావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను రైతులు అంది పుచ్చుకుంటూ వ్యవసాయం లో అధిక దిగుబడులు సాధించాలని అన్నారు, మూస పద్ధతుల ద్వారా చేస్తున్న వ్యవసాయం అధిక నష్టాలను, ఆత్మ హత్యలకు కారణం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వాతావరణం లో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సేంద్రియ ఆర్గానిక్ వ్యవసాయం చేసి విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించాలని, రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, గిట్టుబాటు ధర కల్పించి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని రామారావు కోరారు.వ్యవసాయ శాఖల అధికారులు ప్రతి పంట సాగు సమయంలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు సూచనలు, సలహాలు అందించాలన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను విరివిగా ఏర్పాటు చేసి రైతులు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు.వరిపంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్, కంది, పెసరు, మిర్చి, వేరుశెనగ, మొక్కజొన్న, డ్రాగన్ ఫ్రూట్స్ లాంటి పంటలను ప్రోత్సహించి, వాటికి కనీస మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.రైతులు తమ వ్యవసాయ భూముల్లో పంటలు వేసుకునే నిర్ణయాధికారాన్ని రైతుల అభీష్టానికే వదిలి వేయాల న్నారు. అయితే ప్రత్యామ్నాయ పంటలు, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాల్సిన అవసరం వుందని ఇందుకు ప్రభుత్వాలు ప్రోత్సహించాలని అన్నారు. రైతులకు కల్పిస్తున్న భీమా వయోపరిమితిని 59 సం. ల నుంచి 69 సంవత్సరాల వరకు పెంచి సడలించాలని,50 సం. లు నిండిన రైతులందరికి నెలకు 5 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని , హెల్త్ కార్డులు అందించాలని, పేద రైతు కుటుంబాల్లోని విద్యార్థులకు విదేశే విద్యకు 25 లక్షల రూపాయలు ఆర్తిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.అర్థిక స్థితి గతుల ఆధారంగా రైతులకు 80 శాతం రాయితీ తో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు ఎరువులు పురుగు మందులు, అందజేయాలన్నారు. రైతుల వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధించాలని, పంటల ఫసల్ భీమా పథకాన్ని గ్రామాన్ని యూనిట్ గా పరిగణించి అమలు చేయాలని, పంటల ఉత్పత్తులను గిట్టు బాటు ధరతో వెనువెంటనే ప్రభుత్వాలే నేరుగా కొనుగోళ్లు చేయాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో విత్తనాలు వేసుకోవడం, సమగ్ర నీటి యాజమాన్య, పోషక పద్ధతులు, పంటల మార్పిడి, అంతరపంటల సాగు, రసాయన ఎరువులు, పురుగుల మందు వాడకం తగ్గించేలా ప్రభుత్వాలు రైతులను చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి ప్రధాన కార్యదర్శి చందుపట్ల నర్సింహ్మారెడ్డి నాయకులు కంకణాల సరోజన జనార్ధన్ రెడ్డి , విజయా రెడ్డి,తాటి పల్లి రాజన్న విష్ణు దాస్ గోపాల్ రావు, ముచ్చా సమ్మిరెడ్డి, లక్ష్మణ మూర్తి, కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పంటల్ని దోచుకునేందుకే నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం

**రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వ కుట్ర**

**పంటల మద్దతు ధర, రైతాంగ హక్కులకై జరిగే ఉద్యమాలపై నిర్బంధాన్ని ఆపాలి**

**ఎస్ కే యం ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో నూతన పాలసీ పత్రాల దగ్ధం - భారీ నిరసన**




**తొలి సమయం వరంగల్ 23:** రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయకుండా కేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు దోచుకునేందుకు వీలుగా కేంద్ర నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తీసుకువచ్చిందని ఇది దేశ వ్యవసాయానికి వాస్తవ సాగుదారులకు ప్రజలకు ఎంతో హానికరమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు ఈసంపల్లి బాబు సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు చిర్ర సూరి అన్నారు.ఈరోజు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు కార్యకర్తలు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్లే కార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టి నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రాలను దగ్ధం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్కేయం జిల్లా కన్వీనర్ కుసుంబ బాబురావు అధ్యక్షతన నిరసన కార్యక్రమంలో పెద్దారపు రమేష్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక 3 నల్ల చట్టాలను అమలు చేయమని కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చి ఆచరణలో దొడ్డిదారిన అవే నల్ల చట్టాల అమలుకు పూనుకుంటున్నారని అందుకు ప్రత్యక్ష నిదర్శనమే నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానమని, కార్పొరేట్ శక్తులకు పెట్టుబడుదారులకు వ్యాపారులకు మార్కెట్ వ్యవస్థను అప్పగించడమే వారి ఉద్దేశమని తద్వారా ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ వ్యవస్థను నీరుగార్చి రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అప్పనంగా దోచుకోవడానికి వీలు కల్పించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. చావు తప్పి కళ్ళు లొట్టబోయిన రీతిన ప్రజలు తీర్పునిచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోకపోగా మరింత పదును పెట్టి దేశ వ్యవసాయాన్ని, రైతులను సంక్షోభంలోకి నెట్టే విధానాల రూపకల్పనకు ప్రయత్నిస్తున్నదని కనీస మద్దతు ధర చట్టానికి హామీ ఇచ్చి నేటికీ అమలుకు పూనుకోకపోవడం సిగ్గుచేటని ఈ తరుణంలో గత చారిత్రాత్మక రైతాంగ ఉద్యమ బాటలో ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం ప్రారంభమైందని అట్టి రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ రైతు ఉద్యమకారులను అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టి జైల్లోకి పంపారని ఎస్కేయం జాతీయ నాయకుడు జగత్ సింగ్ దలైవాల 28 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కనీసం రైతు సంఘాలతో చర్చలు జరపాలనే స్పృహ కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడం ఆవేదన కలిగిస్తుందని ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలకి స్వస్తి పలికి రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని చేసి ఉత్పత్తి ఖర్చులను తగ్గించి దేశాన్ని కాపాడాలని లేకపోతే రైతాంగ ఉద్యమం క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. వెంటనే నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పంజాబీ సరిహద్దుల్లో రైతుల పోరాటంపై అనిచివేతను ఆపాలని, గ్రేటర్ నోయిడా జైల్లో ఉన్న రైతు నాయకులను విడుదల చేయాలని, రైతు సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కేయం జిల్లా నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ సుధమల్ల భాస్కర్ వల్లందాస్ కుమార్ కొత్తూరి ఇంద్రసేన ఐతం నాగేష్ సింగతి మల్లికార్జున్ ఓదెల రాజన్న మైదం పాణి బండి కుమార్ ఎండి బషీర్ ఆరూరి కుమార్ ఎగ్గెని మల్లికార్జున్ మాలి ప్రభాకర్ అప్పనపురి నరసయ్య బొల్లు ఎల్లయ్య చేరాలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు డబ్ల్యూజేఐ అవార్డులు

**- దరఖాస్తుల ఆహ్వానం - బ్రోచర్ విడుదల**



**తొలి సమయం హైదరాబాద్:** సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే పాత్రికేయ రంగంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నవారికి అవార్డులు ఇవ్వనున్నట్లు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ప్రకటించింది. హైదరాబాద్ లోని జర్నలిస్టుల కాలనీలో సోమ వారం 2024 అవార్డుల బ్రోచర్ ను రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్ కృపాకర్, రాష్ట్ర అధ్యక్షులు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తాడూరి కరుణాకర్, కార్యదర్శి క్రాంతి లు విడుదల చేశారు. మూడు కేటగిరీలలో జర్నలిస్టులకు అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా తో పాటు డిజిటల్ మీడియాకు ఈ ఏడాది నుంచి అవార్డులు ఇస్తున్నట్లు వారు చెప్పారు. ప్రతి విభాగం నుంచి ప్రతిభావంతులను ఎంపికచేసి ఈ అవార్డులను బహూకరించనున్నారు. సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ విజేతలను ఎంపిక చేయనుంది. వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న ఆసక్తిగల వారు జనవరి 10వ తేదీలోగా ఎంట్రీలు telangana 2017@gmail.com పంపించాలని కోరారు. జనవరి మూడోవారంలో హైదరాబాద్‌లో పురస్కారప్రదానకార్యక్రమాన్ని నిర్వహించను న్నట్లు వెల్లడించారు.

**హైదరాబాద్ కమిటీ ప్రకటన**


జర్నలిస్టుల సంక్షేమం కోసం దేశ వ్యాప్తంగా కృషి చేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ కమిటీని ప్రకటించింది. అధ్యక్షులుగా బాలక్రిష్ణ, ఉపాధ్యక్షులుగా కోటిరెడ్డి, నవత, కార్యదర్శిగా పవన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శ్రీ హర్ష కోశాధికారిగా సావర్కర్ లను ప్రకటించారు. రాబోయే రోజులు సభ్యత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. . జాతీయ భావజాల వ్యాప్తికి, పాత్రికేయులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు అందరూ కలిసి పని చేయాలని సూచించారు.

## మరమ్మత్తుల పేరుతో మెటల్ పరిచి బీటీవేయలేదు

**రోడ్ పై లేస్తున్న దుమ్ముతో శ్వాస కోశ వ్యాధులు**



**తొలి సమయం ములుగు 23:** ములుగు జిల్లా వెంకటాపురం చర్ల ప్రధాన రహదారి ఎదిర పంచాయతీ ఏకన్నగూడెం గ్రామస్తులు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహిం చారు. రహదారి మరమ్మత్తులు పేరుతో మెటల్ పరిచి బీ.టీ వేయకుండా నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్ వదిలేశారని, బీటీ వేయక పోవడంతో వచ్చి పోయే ఇసుక లారీలు ఇతర వాహనాల కారణంగా దుమ్ము, దూళి లేచి శ్వాసకోశ వ్యాధులతో పాటు, ప్రధాన రహదారి కి ఇరువైపులు ఉన్న పంట పొలాలు మిర్చి పంట ఇతర పంటలపై దుమ్ము ధూళి పడి పంట నష్టం జరుగుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని సోమవారం ఉదయం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాలు వందల సంఖ్యలో నిలిచిపోయాయి. సంవత్సరం పైగా రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకున్న, సెల్ఫోన్ ద్వారా ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి తర్వాత వదిలేస్తున్నారని,ఈ ప్రకారంగా సుమారు 16 నెలలు పైగా అయిన రోడ్డు పై బీటి వేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు భవనాల శాఖ బడా కాంట్రాక్టర్ తో ప్రజా ప్రతినిధులకు, పార్టీలకు సన్నిహిత సంబం ధాలు ఉన్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవటం లేదని శాపనార్థాలు పెడుతూ, దుమ్మెత్తి పోస్తున్నారు.



## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి
# సత్వర చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**



**తొలి సమయం హనుమకొండ23:** వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఆయా శాఖల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు అందించిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 175 దరఖాస్తులు కలెక్టర్ కు అందజేశారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్లాత్ బ్యాగులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, హన్మకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, సి పి ఓ సత్యనారాయణ రెడ్డి ఇతర జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నరు

## మౌలిక సక్రమంగా అందుతున్నాయా

**-నూతన మెనూ ను అనుసరిస్తూ భోజనం ఉండాలి**

**జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**

**తొలి సమయం హనుమకొండ 23:** హనుమకొండ జులైవాడలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి.జిల్లా కలెక్టర్ జులైవాడలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినీలను మౌలిక



సదుపాయాలు సక్రమంగా అందజేయడం జరుగుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా నూతన మెనూ ప్రకారంగా భోజన సదుపాయాలు అందజేయడం జరుగుతున్నదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అందుబాటులో ఉన్న వార్డెన్ మరియు ఫిజికల్ టీచర్ ఏఎన్ఎం లను విద్యార్థులకు అందజేయుచున్న ఇతర సౌకర్యాలు గురించి వాకప్ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మెనూ ప్రకారంగా విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు విద్యార్థులకు చదవడంలో పలు మెలకువలు తెలుపుతూ పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ఆదర్శ పాఠశాలగా ఎదగాలని అభిలాషించారు అదేవిధంగా మూడో తరగతి విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించి తెలుగు పద్యాలను చదివించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ ప్రేమ కళ కూడా విచ్చేసి కలెక్టర్ పర్యటనలో పాల్గొన్నారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు




**తొలి సమయం దంతాలపల్లి డిసెంబర్23** దంతాలపల్లి మండలం దాట్ల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాద్యాయులు కొమ్మవరపు కృష్ణయ్య , ఉపాధ్యాయురాలు ఎం సునీత ఆధ్వర్యంలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ కరుణామయుడు అయిన ఏసు క్రీస్తు జననం, తన జీవిత విశేషాలు, తన బోధనలోని నైతిక విలువలను తెలియ చేస్తూ, ఏ విధంగా సమాజంలో జీవనం గడపాలో ప్రేమ, దయ క్షమించే గుణం ఉండాలో, బైబిల్ లోని కథలు వివరించారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక, పిల్లలు పాడిన పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, రమేష్, ప్రేమ్ కుమార్, రామయ్య, సాయి కుమార్, రోషిణి, యాక స్వామి, రిచిత తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో
# విద్యార్థులకు స్టడీమెటీరియల్స్ అందజేత



**తొలి సమయం పెద్ద వంగర డిసెంబర్23** పెద్ద వంగర మండలంలోని వడ్డే కొత్తపల్లి గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ స్కూల్లో తొర్రూరు టీచర్స్ఆధ్వర్యంలో టీచర్స్ క్లబ్ సిగ్నేచర్ ప్రాజెక్ట్ అయిన ఆల్ ఇన్ వన్ పంపిణీ కార్యక్రమం లో భాగంగా వడ్డే కొత్తపల్లి జడ్పిహెచ్ఎస్ పాఠశాల లో క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ అధ్యక్షతన వడ్డేకొత్తపల్లి పాఠశాల లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెలిదే సురేష్ కుమార్ - సంధ్యారాణి గారి ఆర్థిక సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మరియు ఎగ్జామ్ మెటీరియల్ మరియు స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ఎఫ్.డబ్ల్యు సి డాక్టర్ వేలూరి శారద గారుమాట్లాడుతూ అవసరార్థులకు %ఢ% అన్నార్తులకు సేవ చేయడ0 అభినందనీయమని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితిలో ఉండాలని అన్నారు , విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ గారు మాట్లాడుతూ విద్యార్థులకు మెటీరియల్ అందించిన వెలిదే సురేష్ కుమార్- సంధ్యారాణి దంపతులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, టీచర్స్ క్లబ్ సేవే మార్గం సేవే లక్ష్యంతో పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం టీచర్స్ క్లబ్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ అందజేస్తుందని, విద్యార్థులు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ ను ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాత వెలిదే సురేష్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధన కోసం విలువైన సలహాలు సూచనలు అందించి, విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు %ఢ% గురువులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శేషవల్లి గారు గారు టీచర్స్ క్లబ్ వారు మా పాఠశాలకి మెటీరియల్ అందించడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు, మాట్లాడుతూఈ కార్యక్రమంలో అధ్యక్షులు చింతల సురేష్, క్లబ్ ప్రధాన కార్యదర్శి వెలిదే సురేష్ కుమార్, క్లబ్ పూర్వ అధ్యక్షులు రాయపల్లి యాకయ్య, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ఇల్లందుల శ్రీనివాస్, మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# భద్రకాళి వైన్స్ లో దొంగలు దోచుకెళ్లారు

**- సుమారు 55 వేల విలువైన మద్యం సీసాలు - 5 వేల రూపాయల నగదు అపహరణకు గురి**

**- రాత్రి ఒంటిగంట సమయంలో సంఘటన - జి ఉపేందర్ ఎస్సై తొర్రూర్**



**తొలి సమయం తొర్రూర్ డిసెంబర్23** తొర్రూరు పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సెంటర్ సమీపంలో ఉన్న భద్రకాళి వైన్స్ లో ఆదివారంరాత్రి భారీ చోరి చోటు చేసుకుంది. వైన్స్ షాప్ నిర్వాహకులు వెల్లడించిన సమాచారం మేరకు చోరులు దుకాణంలోకి ప్రవేశించి సుమారు 55 వేల రూపాయల

విలువైన మద్యం సీసాలను, 5 వేల రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా రికార్డ్ అయిన దృశ్యశ్రవణం ఆధారంగా వైన్ షాప్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై జి ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటన స్థలంలో సోమవారం క్లూస్ టీం ను రంగంలోకి దించి ఫింగర్ ప్రింట్లు ఇతర ఆధారాలను సేకరించినట్లు, రాత్రి ఒంటిగంట సమయంలో సంఘటన జరిగినట్లు తెలిపారు. అంతేకాకుండా నిందితులను పట్టుకోవడానికి విచారణను ముమ్మరం చేసినట్లు యస్ ఐ జి ఉపేందర్ తెలిపారు.

# ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వ్యాఖ్యలు

**- 70 గంటల పనిదినాలపై కొనసాగుతున్న చర్చ - విభేదించిన ఎంపి కార్తీ చిదంబరం**

**న్యూఢిల్లీ,డిసెంబర్23:** అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటలు చొప్పున పని చేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై చర్చ కొనసాగుతూనే ఉంది. తాజాగా ఆయన అభిప్రాయాన్ని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం విభేదించారు. సుదీర్ఘంగా పని చేయాలని చెప్పడం అర్థరహితం అని, ముందు సమర్థతపై దృష్టిపెట్టాలని కౌంటర్ ఇచ్చారు. '70 పని గంటల విధానాన్ని సమర్థిస్తూ నారాయణమూర్తి గత కొంతకాలంగా వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ కార్యక్రమంలో ఆయన మరోసారి ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'భారత్ వారానికి ఆరు పనిదినాల నుంచి ఐదు రోజుల పనికి మారడంపై నేను తీవ్ర అసంతృప్తిగా ఉన్నా. వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై నాకు నమ్మకం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయులు విశ్రాంతి తీసుకోవడం కాదు త్యాగాలు చేయాలి. నేను ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకే ఆఫీసుకు వెళ్లి.. రాత్రి 8.40 గంటలకు బయటికొస్తా. వారానికి ఆరున్నర రోజులు పనిచేస్తా' అని వ్యాఖ్యానించారు. దీనిపై కార్తీ చిదంబరం స్పందిస్తూ.. నారాయణమూర్తి అభిప్రాయంపై విమర్శలు గుప్పించారు. 'సుదీర్ఘంగా పనిచేయడం అనేది అర్థరహితం. దానికి బదులుగా సమర్థతపై దృష్టిపెట్టాలి. అసమర్థమైన, నాసిరకం మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను ఎదుర్కొంటూ మన రోజువారీ జీవితం ఒక పోరాటంలా సాగుతోంది. మంచి సామాజిక క్రమం, సామరస్య పరిస్థితుల కోసం వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అనేది చాలా ముఖ్యం. వాస్తవానికి మనం వారానికి 4 రోజుల పని విధానానికి మారాలి. సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల కల్లా పని ముగియాలి' అని కాంగ్రెస్ ఎంపీ వివరించారు.ఆ మధ్య ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'ది రికార్డ్' అనే పాడ్‌కాస్ట్ తొలి ఎపిసోడ్‌లో మాట్లాడిన నారాయణమూర్తి.. ప్రపంచదేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువని అన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో.. మనమూ అలాగే శ్రమించాలని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. కొందరు ఉద్యోగ జీవితంలో ఉండే ఇబ్బందులను లేవనెత్తగా.. మరికొందరు బాస్‌లు మాత్రం నారాయణమూర్తి అభిప్రాయాన్ని స్వాగతించారు.

# డబ్బులు కట్టినంత మాత్రాన పేర్ని దొర అవుతాడా

**- పేర్ని నానికి సహకరించే అధికారులపై చర్యలు**

**- బియ్యం మాయంపై ప్రత్యేక దర్యాప్తును కోరుతా - మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**

**విజయవాడ,డిసెంబర్23:** వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని గోదాముల్లో రేషన్ బియ్యం మిస్సింగ్ కేసుపై మంత్రి కొల్లు రవీంద్ర మరోమారు సీరియస్ అయ్యారు. ఈ కేసులో పేర్ని నానికి సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్న అధికారులకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. విచారణలో భాగంగా అధికారుల పాత్ర ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం కుంభకోణంపై సిట్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తానన్నారు. తప్పు చేసి డబ్బులు కడితే పేర్ని నాని దొర అవుతాడా? అని మంత్రి ప్రశ్నించారు. పదేపదే నీతి వ్యాఖ్యలు చెప్పే పేర్ని నాని.. ఇపుడు ఎక్కడ ఉన్నాడని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. పేదల బియ్యం కొట్టేసిన పేర్ని నానిని పంది కొక్కులా చూడాలి. నీతులు చెప్పే నాని ఇప్పుడు అడ్రస్ లేరు. దొంగ పనులు చేసి.. నిత్యం నీతులు చెప్పేవారు. తప్పు చేసి డబ్బులు కడితే దొర అవుతాడా?. పదేపదే నీతి వ్యాఖ్యలు చెప్పే నాని.. ఇపుడు ఎక్కడ ఉన్నారు?. పేర్ని నాని కుటుంబం స్కాం చేసింది వాస్తవం, అది స్వయానా నాని ఒప్పుకున్నారు. దారి మళ్లిన పీడీఎస్ రైస్ స్కాంపై వివరణ ఇచ్చుకోలేని దుస్థితిలో నాని ఉన్నారు. తప్పు చేయనపుడు దొంగలా తప్పించుకొని తిరగడం ఎందుకని ప్రశ్నించారు.తప్పు చేసిన ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. స్కాంపై సిట్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తాను. విచారణలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు. కక్ష సాధింపు చేయాల్సిన మాకు అవసరం లేదు. కక్ష సాధింపు చేస్తే స్కాంలో ఉన్న పేర్ని నాని కుటుంభం మొత్తాన్ని జైలుకు పంపేవాళ్లం. కానీ మేము అలా చేయలేదు' అని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. పేర్ని నాని అధికార దుర్వినియోగానికి పాల్పడి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారని ఆరోపణలు ఉన్నాయి. 32,00 బస్తాల రేషన్ బియ్యం తగ్గినట్టు అధికారులకు నాని లేఖ రాయగా.. అధికారుల పరిశీలనలో 3,708 బస్తాలు తగ్గినట్టు తేలింది. బియ్యం తగ్గడంపై 2 దఫాలుగా రూ.1.70 కోట్లు పేర్ని నాని చెల్లించారు. గోదాములు నాని భార్య జయసుధ పేరుతో ఉండటంతో పోలీసులు ఆమెపై కూడా కేసు నమోదు చేశారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101